క్లుప్తంగా

నేటి నుంచి ఆలయ ఉత్సవాలు



ఆంజనేయస్వామి దేవాలయం

బొంరాస్‌పేట: ఏర్పుమళ్లలో సోమవారం నుంచి ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ నెల 12 నుంచి 14 వరకు శ్రీ మహాగణపతి, నాగులు, నవగ్రహాలు, బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఉంటాయని నిర్వాహకులు, గ్రామపెద్దలు, సర్పంచ్ పార్వతమ్మ తెలిపారు.

తెల్లబంగారానికే మొగ్గు



పత్తి విత్తనాలు విత్తుతున్న రైతు కూలీలు

పెద్దేముల్: వానాకాలం సాగు మొదలైంది. ఈ సారి కూడా రైతులు పత్తి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రెండు రోజుల నుంచి కురిసిన వర్షాలకు ఆదివారం పెద్దేముల్, మంబాపూర్, జనగాం, తింసాన్‌పల్లి, బుద్దారం, గాజీపూర్‌తో పాటు పలు గ్రామాల్లో రైతులు విత్తనాలు విత్తడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా.. అనుకున్న పత్తి విత్తనాలు దొరకడం లేదని పలు గ్రామాల రైతులు అంటున్నారు. పత్తితో పాటు కంది, మినుము, పెసర విత్తనాలు నాటుతున్నట్లు అన్నదాతలు చెప్పారు.

వైస్ చైర్‌పర్సన్‌కు సన్మానం



వాణిశ్రీని సన్మానిస్తున్న సంఘం నాయకులు

కొడంగల్: కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ వాణిశ్రీని తాలూకా యాదవ్ సంఘం, కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఇరు సంఘాల నాయకులు పట్టణంలోని ఆమె నివాసంలో వాణిశ్రీయాదవ్, కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్‌లను శాలువా, పూలదండతో సత్కరించారు. కార్యక్రమంలో హస్నాబాద్ సర్పంచ్ పకీరప్ప, మధు, రమేష్, శ్రీనివాస్, రామకృష్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఉర్సు ఉత్సవాలు



జెడ్పీటీసీకి ఆహ్వానం అందజేస్తున్న ముస్లింలు

బొంరాస్‌పేట: ఈనెల 15 నుంచి 17వరకు జరగనున్న ఉర్సు ఉత్సవాలకు హాజరుకావాలని జెడ్పీటీసీ సభ్యురాలు అరుణదేశు చౌహాన్‌కు ఆదివారం ముస్లిం పెద్దలు వాహబ్ తదితరులు ఆహ్వానించారు.

ఆర్థిక సహాయంలో ముదిరాజ్‌లను చేర్చాలి

దోమ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సహాయం పథకంలో ముదిరాజ్‌లను చేర్చాలని మెప్మా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మండల అధ్యక్షుడు కావలి సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి బద్రి ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ ముదిరాజ్ కులాన్ని అవమానించే రీతిలో సహాయాన్ని ప్రకటించి.. అందులో వారిని చేర్చకపోవడం ఎంతవరకు సబబని, బీసీ కులాల్లో ముదిరాజ్‌లు లేరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో జనాభా ప్రతిపాదికన అధిక ఓటింగ్ శాతం కలిగిన ముదిరాజ్‌లకు బీసీ సంక్షేమ శాఖ ఎందుకు విస్మరించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేని యెడలా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఆర్థిక సహాయం

యాలాల: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న హాజీపూర్ గ్రామానికి చెందిన చెన్నారం లాలప్పకు సోమవారం సర్పంచ్ శ్రీనివాస్ ఆర్థిక సహాయం అందజేశారు.

గౌడలపై చిన్నచూపు తగదు

దౌల్తాబాద్: గౌడ కులస్తులపై చిన్నచూపు తగదని ఆ సంఘం మండల నాయకులు సత్యనారాయణగౌడ్, శేఖర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బీసీల్లో అత్యధికంగా ఉన్న గౌడలకు బీసీల రుణాల మంజూరుపై ప్రభుత్వం వివక్ష చూపడం తగదన్నారు. చెట్టుపై నుంచి పడితే బీమా పరిహారం ఇస్తామన్న ప్రభుత్వం.. ఇక్కడ తాటి, ఈత చెట్లను నరికివేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం 18 ఏళ్లు పై బడిన గీతకార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీ రుణాల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

నిర్వహణ నిల్.. సమస్యలు ఫుల్



సబ్‌స్టేషన్‌లో ఆయిల్ లీకేజీ సమస్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



ఫీడర్ కవర్ చేసే బ్లేడ్ సరిగ్గా పనిచేయకపోవడంతో కర్రతో యత్నిస్తున్న సిబ్బంది

- సబ్‌స్టేషన్లలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- గాలి దుమారానికి సరఫరాలో తీవ్ర అంతరాయం
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

యాలాల: విద్యుత్ సరఫరాకు గుండెకాయ లాంటి సబ్‌స్టేషన్‌లో ఓ వైపు నిర్వహణ లోపించి సమస్యలు తలెత్తగా.. మరో వైపు సిబ్బంది కొరత వేధిస్తోంది. ఫలితంగా విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. చిన్నపాటి వర్షానికి, గాలి దుమారానికి కరెంట్ సరఫరాలో సమస్యలు తలెత్తున్నాయి. సబ్‌స్టేషన్లలో ఏటా క్రమం తప్పకుండా చేపట్టాల్సిన మెయింటెనెన్స్ చేపట్టకపోవడంతో తరుచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీంతో సిబ్బంది కొరత ఉండడంతో కార్మికులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని పలువురు కార్మికులు వాపోతున్నారు.

అరకొర సిబ్బంది

యాలాల మండలం బాగాయిపల్లి, రాఘవపూర్, దౌలాపూర్, యాలాల, లక్ష్మీనారాయణపూర్ గ్రామాల్లో 11 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వాటి పరిధిలో పలు ఫీడర్ల నుంచి ప్రతి గ్రామాల్లోని వ్యవసాయ, గృహాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే ఒక్కో సబ్‌స్టేషన్లలో నలుగురు ఆర్టిజన్ కార్మికులు, ఒక జేఎల్ఎం(జూనియర్ లైన్‌మెన్), లైన్‌మెన్ ఉండాలి. ప్రస్తుతానికి ఒక్కో సబ్‌స్టేషన్‌లో ముగ్గురు ఆర్టిజన్ కార్మికులు ఉండగా, యాలాల సబ్‌స్టేషన్‌లో ఇద్దరు ఆర్టిజన్ కార్మికులు మాత్రమే పనిచేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తుండటం, తరుచూ గాలి దుమారంతో కూడిన వర్షాలు పడటం వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా రాత్రివేళ ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని పరిసర ప్రాంత వినియోగదారులు చెబుతున్నారు.

మెయింటెనెన్స్ నిల్!

ప్రతి సబ్‌స్టేషన్‌లో ఏడాదికోసారి శాఖ పరంగా నిర్వహణ పనులు చేపట్టాలి. కానీ అలాంటిదేమీ జరగడం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా సబ్‌స్టేషన్లో నెలకొంటున్న ఏబీ స్విచ్చ్, సెట్టింగ్‌లు, మేల్, ఫిమేల్ బ్లేడ్, బస్‌బార్ ఫిట్టింగ్స్, సీటీస్, పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ వద్ద ఆయిల్ లీకేజి టాంటి సమస్యలు ఎక్కువగా ఉంటాయి. దీంతో తరుచూ విద్యుత్ సరఫరాలో గంటల తరబడి అంతరాయం కలుగుతోంది. ఈ విషయంలో ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో సిబ్బందితో పాటు సౌకర్యాలను కల్పించాలని మండల వినియోగదారులు కోరుతున్నారు.

నాలుగేళ్ల మొర.. ఆలకించని అధికారులు



తాండూరు రూరల్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి స్తంభం ఎత్తు సాక్ష్యం కళ్లెదురుగా కనబడుతోంది. కరెంట్ పోల్ పై భాగంలో పూర్తిగా ఇనుపచువ్వలు తేలి శిథిలావస్థలో ఉన్నా.. విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో అది ఎప్పుడు కూలి ఎవరి ప్రాణాలను బలిగొంటుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు మండలం గుండ్లమడుగు తండాలో ఓ విద్యుత్ స్తంభం పూర్తిగా శిథిలావస్థకు చేరి, నేలకు ఒక వైపు ఒరిగి ప్రమాదకరంగా ఉంది. తండాకు చెందిన కిషన్ ఇంటి ముందు ఉన్న ఈ పోల్ ఎప్పుడు కూలి.. ఏం ప్రమాదం చోటుచేసుకుంటుందోనని భయాందోళన చెందుతున్నారు. నాలుగేళ్లుగా స్తంభాన్ని తొలగించాలని సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని తండా వాసులు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే విద్యుత్ అధికారులదే బాధ్యత అని, ఇప్పటికైనా ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఓవైపు ఒరిగిన విద్యుత్‌స్తంభం (ఇన్‌సెట్లో) పై భాగంలో పరిస్థితి

ప్రజాసేవే ‘పీఎంఆర్’ ధ్యేయం

- క్రీడలు, వైద్య సేవలకు మొదటి ప్రాధాన్యత
- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

పెద్దేముల్: ప్రజాసేవే లక్ష్యంగా పట్నం మహేందర్ రెడ్డి (పీఎంఆర్) ట్రస్ట్ ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో జరుగుతున్న ట్రస్ట్ టోర్నీ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రుద్రారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తూనే.. నిరుపేదలకు ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించేందుకు తాండూరు నుంచి మహేశ్వరం వరకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రినీష్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించామని, అందులో గెలిచిన జట్లకు మొదటి బహుమతిగా రూ.2లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.లక్ష అందచేయడం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణరెడ్డి, తట్టెపల్లి పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, మారేపల్లి సర్పంచ్ బలవంతురెడ్డి, ఇందూరు మాజీ సర్పంచ్ ప్రకాశం, పార్టీ యువ నాయకుడు మైపాల్‌రెడ్డి, నాయకులు నారాయణగౌడ్, విఠల్, అర్గనైజర్లు అరుణ్‌కుమార్, కార్తీక్‌రెడ్డి, ఆదర్శరెడ్డి, అన్వర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లకు మోక్షం



మొరంగపల్లి వద్ద పూర్తయిన సీసీరోడ్డు పనులు

మోమిన్‌పేట: మూడేళ్ల నుంచి పడుతున్న ఇబ్బందులకు తాత్కాలికంగా ఉపశమనం లభించిందని గ్రామస్తులు చెప్పారు. ఎంపీ రంజిత్‌రెడ్డి చొరవతో సీసీరోడ్డు నిర్మించడంతో రాకపోకలకు సమస్య తీరిందని పలువురు వాహనదారులు అన్నారు. మొరంగపల్లి వద్ద తాండూరు వెళ్లే రహదారిలో రైల్వే అండర్ పాసు బ్రిడ్జి నిర్మాణ పనులను మూడేళ్ల క్రితం చేపట్టారు. వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయకపోవడంతో పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన పనులు నెమ్మదించాయని, ఎంపీ రంజిత్‌రెడ్డి చొరవ వలన సీసీరోడ్డు పూర్తి కావడంతో రవాణ కష్టాలు గట్టెక్కాయని స్థానికులు, వాహనదారులు పేర్కొన్నారు.

క్రీడా స్ఫూర్తితో మెలగాలి



టోర్నీ ప్రారంభిస్తున్న నాయకులు

పూడూరు: క్రీడా స్ఫూర్తితో యువత క్రీడల్లో పాల్గొనాలని బీఆర్ఎస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బాలమణి అన్నారు. ఆదివారం మన్నెగుడలో బీఎంఆర్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓటమి గెలుపునకు నాందిగా స్వీకరించాలని సూచించారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.50వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25వేలు నగదు బహుకరిస్తామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, అశోక్‌రెడ్డి, నర్సింహులు, గంగాధర్‌గౌడ్, యూసుబ్, సిరాజ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



ఎన్కేపల్లిలో ఆన్‌లైన్ క్విజ్‌పై అవగాహన కల్పిస్తున్న టీఆర్ఆర్

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: రానున్న సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు. ఆదివారం పూడూరు మండలం ఎన్కేపల్లి, మీర్జాపూర్, పూడూరు, అంగడిచిట్టంపల్లి తదితర గ్రామాల్లో ‘రాహుల్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్‌'పై యువతకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రియాంక గాంధీ పొందుపర్చిన హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొలిపే లక్ష్యంతో ఈ నెల 18న నిర్వహించే ఆన్‌లైన్ క్విజ్‌లో యువత భాగస్వామ్యం కావాలని కోరారు. పార్టీ అధికారంలోకి రాగానే నిరుపేదలకు సంక్షేమ పథకాలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఏకకాలంలో రైతు రుణమాఫీ, అర్హులందరికీ పింఛన్‌లు ఇవ్వడం జరుగుతుందని టీఆర్ఆర్ వెల్లడించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, షకీల్, పెంటయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములపై హక్కులు

- రైతుల సంక్షేమమే సర్కారు లక్ష్యం
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



కుల్కచర్ల: మందిపల్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: అర్హులైన రైతులందరికీ పోడు భూములపై హక్కులు కల్పిస్తామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి చెప్పారు. పల్లెబాటలో భాగంగా ఆదివారం చౌడాపూర్ మండల పుర్సంపల్లి, కొత్తపల్లి తండా, మక్తవెంకటాపూర్, మందిపల్, విఠలాపూర్, ఈర్లవాగు తండాల్లో ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని తెలిపారు. మండల పరిధిలో పోడు భూముల సమస్య అధికంగా ఉందని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. వచ్చే నెలలో పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నదని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, వైస్ ఎంపీపీ రాజశేఖర్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహులు, యువజన విభాగం అధ్యక్షుడు మేగ్యానాయక్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్, సర్పంచులు మఠం ప్రమీల, కొత్తరంగారెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్ రెడ్డి, మక్తవెంకటాపూర్ ఎంపీటీసీ చిలకల సత్యమ్మ, నాయకులు మఠం రాజశేఖర్, మొగులయ్య, శివకుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి కృషి

దోమ: సంజీవ స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి అన్ని విధాలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. దోమ మండలం దొంగ ఎన్కేపల్లిలో సంజీవ స్వామి దేవాలయం ఆవరణలో పార్టీలకు అతీతంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయం శిథిలావస్థలో ఉందని తమ దృష్టికి వచ్చిందని, ఇదే విషయం దేవాదాయ శాఖ అధికారులతో మాట్లాడదని చెప్పారు. రూ.50 లక్షలు పక్షం రోజుల్లో మంజూరు చేయించి, నెల రోజుల్లో ఆలయ పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమీక్షలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డిలు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గుడిని పునర్నిర్మిద్దామని, దేవాలయానికి సంబంధించిన భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటి పరిరక్షణకు పాటుపడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, సర్పంచ్ అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచులు కృష్ణయ్య, వెంకటయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అండగా..

పరిగి: ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దాదాపూర్ గ్రామానికి చెందిన 70 మంది వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పరామర్శ

కొడంగల్: పెద్ద నందిగామ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ నాయకుడు మహ్మద్ ఆరీఫ్ తండ్రి మహ్మద్ అజీజ్ చనిపోయారు. విషయం తెలుసుకున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిరుపతిరెడ్డి ఆదివారం కార్యకర్త ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సహాయం

తాండూరు రూరల్: గౌతపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్(మున్సిపల్ జవాన్)గత నెలలో గుండెపోటుతో మృతి చెందాడు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2003–2005 సంవత్సరంలో తనతో పాటు చదువుకున్న మిత్రుడు అకాల మరణంతో.. బాల్యమిత్రులు స్నేహితుడి కుటుంబానికి ఆసరాగా నిలిచారు. మిత్రులందరూ కలిసి రూ.26,100 నగదును మృతుడు శ్రీనివాస్ భార్య బాలమణికి అందజేశారు.

ప్రజావాణిని వినియోగించుకోండి

బంట్వారం: ప్రతి సోమవారం రెవెన్యూ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు శ్రీనివాస్ రెడ్డి, అఫ్జల్‌రసూల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధరణికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ఇందులో ఫిర్యాదు చేసుకోవాలని, అర్జీలను పరిశీలించి వెంటనే మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు పెట్టిస్తామని తెలిపారు.

ఘన నివాళి

అనంతగిరి: ములుగు జెడ్పీ చైర్మన్ జగదీష్ అకాల మృతితో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. ఆదివారం వికారాబాద్‌లో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సునీతారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు

నందిగామ: శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు.. కళాకారుల డప్పు వాయిద్యాల మధ్య మండలంలోని మోదళ్లగూడలో గ్రామస్తులు బోనాల ఊరేగింపును ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో గత మూడు రోజులుగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయి ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు నిర్వహించిన విషయం విదితమే. మూడో రోజు ఆదివారం సర్పంచ్ ఉమారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవి, నాయకులు రవీందర్, ప్రవీణ్ రెడ్డి,రమేశ్, గణేష్, రాఘవేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవులకు బైబై

నేటి నుంచి బడిగంట

బషీరాబాద్: వేసవి సెలవులకు సెలవ్ చెబుతూ.. నేటి నుంచి బడిగంట మోగనుంది. సమస్యల నడుమ సర్కారు బడులు తెరుచుకోనున్నాయి. బషీరాబాద్ మండలంలో 47 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ బడుల్లో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులు సుమారు 6వేల వరకు ఉన్నారు. అయితే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు 150 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా.. 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 11 జెడ్పీ ఉన్నత పాఠశాలలకు 124 మంది అవసరం ఉండగా, 97 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. మండలంలో మొత్తంగా 39 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీగా ఉన్నాయి.

ప్రతి ఉపాధ్యాయుడు వెళ్లాల్సిందే

తాండూరు రూరల్: పాఠశాలలు నేటి నుంచి ప్రారంభం కానుండడంతో ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు బడికి తప్పకుండా వెళ్లాలని ఎంఈఓ వెంకటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాలయాలు పునఃప్రారంభం కావడంతో వాటిని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని చెప్పారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు

దౌల్తాబాద్: నేటి నుంచి బడింగట మోగనున్న నేపథ్యంలో.. ప్రభుత్వం ఎంఆర్‌సీలకు పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలను హెచ్ఎంలు వారివారి పాఠశాలలకు తీసుకెళ్తున్నారు. అలాగే త్వరలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేసేలా చర్యలు తీసుకుంటామని విద్యాధికారులు తెలిపారు.

తీర్మానం ప్రకారమే పట్టాల పంపిణీ

ఎవరి నుంచి పైసలు తీసుకోలేదు: ఉప సర్పంచ్



సమావేశంలో మాట్లాడుతున్న ఉప సర్పంచ్ అనిత తదితరులు

పెద్దేముల్: తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తీర్మానం ప్రకారమే.. అధికారులు అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని, లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయికూడా తీసుకోలేదని ఉప సర్పంచ్ అనిత అన్నారు. ఆదివారం రుక్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఖరీదు చేసిన భూమిలో.. ఇళ్లు లేని పేదలకు అధికారులు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని, ఇది పంచాయతీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. సర్పంచ్ శివలీల చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, పట్టాల పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, ఎవరి నుంచి రూపాయి కూడా అధికారులు, నాయకులు తీసుకోలేదని అనిత స్పష్టం చేశారు. కొంతమంది లబ్ధిదారులు మాట్లాడుతూ సర్పంచ్ భర్త డబ్బులు అడిగారని ఆరోపించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌తో పాటు.. లబ్ధిదారులు లక్ష్మి, కవిత, సంగమ్మ, భారతమ్మ, హరిత, పోచమ్మ, అనిత, రాందాస్, లక్ష్మణ్, బాబు, వీరప్ప, విజయ్ తదితరులు పాల్గొన్నారు.